ప్రజాశక్తి
ఆదివారం 31 ఆగస్టు 2025
8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం

◆ 2030 నాటికి రోడ్‌మ్యాప్ ◆ 'సేనతో సేనాని' బహిరంగ సభలో పవన్ ◆ దసరా తర్వాత 'త్రిశూల్'

సభలో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ విలేకరి

క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి రోడ్డు మ్యాప్ సిద్ధం చేస్తున్నామని, టార్గెట్ 2030తో ముందుకు వెళ్తున్నామని జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్ తమ విధానమని పేర్కొన్నారు. విశాఖ వన్‌టౌన్ ఏరియా ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో అల్లూరి సీతారామరాజు ప్రాంగణంలో శనివారం సాయంత్రం 'సేనతో సేనాని' బహిరంగ సభ నిర్వహించారు. వేదిక నుంచి పార్టీ శ్రేణులకు పవన్ దిశానిర్దేశం చేశారు. జనసేన రోడ్‌మ్యాప్ తయారయ్యేసరికి పార్టీ కార్యకర్తలు, వీరమహిళలు మరింత బలంగా ఎదగాలని మిగతా 2లో..

వార్త 2లో..

మాట్లాడుతున్న అవినాష్ జోషి

సీ ఫుడ్స్ ఎగుమతుల సమస్యలు పరిష్కరిస్తాం

ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ కార్యదర్శి అవినాష్ జోషి

మూడు రోజులూ / పాత చింతకాయ ముచ్చట్లే !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఎప్పుడూ పాత చింతకాయ పచ్చడే' అన్న సామెతను గుర్తుకు తెచ్చేలా ఈ నెల 28 నుంచి 30 వరకూ విశాఖ కేంద్రంగా జనసేన ఆధ్వర్యంలో 'సేనతో సేనాని' సమావేశాలు, 29న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ పర్యటనలు సాగాయి. ఊదరగొట్టు ప్రసంగాలు తప్ప విశాఖలోని కీలక అంశాలపై వారు మాట్లాడింది లేదు. జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, సూటు బూటు వేసుకునే బడా పారిశ్రామికవేత్తలు, పెద్ద పెద్ద హోటళ్లలో చర్చలు, సమావేశాలు, రూ.వేలు లేదా లక్షల కోట్ల పెట్టుబడులంటూ ఊదరగొట్టే ప్రసంగాలు చేసి బాబు, లోకేష్ తిరుగు పయనమయ్యారు. ఇదంతా చూస్తే 'పాత చింతకాయ పచ్చడి' ముచ్చట్లుగానే అనిపించకమానదు. పవన్ జనసేన పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన భేటీలూ ఈ కోవలోకే వస్తాయి. విశాఖ

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నాలుగేళ్ల నుంచి ఇక్కడి ప్రజానీకం, కార్మికులూ పోరాడుతున్నా వారికి పట్టలేదు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలేవీ ఈ పెద్దలకు గుర్తుకు రాలేదు. ఇటీవల కాలంలో కాంట్రాక్టు కార్మికులను వేల సంఖ్యలో తొలగిస్తున్నా 'కూటమి' నేతలు నోరుమెదపలేదు. ఎప్పటిలాగే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని, తామే కాపాడుతున్నామని మాత్రం ప్రగల్భాలు పలికి వెళ్లిపోయారు.

కొత్త వంచనకు శ్రీకారం

టిడిపి, జనసేన నేతలు పర్యటనలు ముగిసిన తర్వాత టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక గాజువాక ఎంఎల్ఎ పల్లా శ్రీనివాసరావు స్థానికులకు 50 శాతం ఉద్యోగాల్లేకపోతే ఊరుకోబోమని చెబుతూ మోసగించే కుట్రకు మిగతా 2లో..

పారదర్శకంగా బార్ల కేటాయింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎపి నూతన బార్ పాలసీ 2025-28 నిబంధనలకు అనుగుణంగా జిల్లాలోని మద్యం బార్ల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా సాగినట్టు అధికారులు తెలిపారు. స్థానిక విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో శనివారం ఉదయం నిర్వహించిన ఈ ప్రక్రియలో జెసి కె.మయూర్ అశోక్ ఆశావహుల సమక్షంలో లాటరీ తీసి బార్లు కేటాయించారు. జివిఎంసి పరిధిలో 131 బార్లకుగాను ఆశావహుల నుంచి 263 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించి నూతన బార్ పాలసీ నిబంధనల మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. గీత కులాలకు పది, జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 57 బార్లను కేటాయిస్తూ లాటరీ ప్రక్రియను చేపట్టారు. ఎక్సైజ్ డిసి రామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. నూతన బార్ పాలసీకి అనుగుణంగా మిగతా 2లో..

సీ ఫుడ్స్ ఎగుమతుల సమస్యలు పరిష్కరిస్తాం

ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ కార్యదర్శి అవినాష్ జోషి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సీఫుడ్స్ ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ భారత కార్యదర్శి అవినాష్ జోషి అన్నారు. భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో సీ ఫుడ్ ఎగుమతిదారులతో శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమావేశం జరిగింది. సీ ఫుడ్స్ ఎగుమతిదారులు పవన్ కుమార్, జీఎస్.రావు తదితరులు ఎగుమతుల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం నుంచి కావాల్సిన సహకారంపై మాట్లాడారు. ఆ సమస్యల పరిష్కారానికి అవినాష్ జోషి హామీ ఇచ్చారు. ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సెక్రటరీ చిరంజీవి చౌదరి మాట్లాడుతూ స్థానికంగా సీ ఫుడ్ వినియోగాన్ని పెంచడానికి అందరూ కలిసి ఆలోచించి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యశాఖ కమిషనర్ రామ్ శంకర్ నాయక్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఫిషరీస్ జెడి పి.లక్ష్మణరావు, ఎంపెడా జెడి విజయ్ కుమార్, మత్స్య శాఖ డిడి అలీ, ఎంపెడా అధికారులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

బాధితుని సమస్య తెలుసుకుంటున్న పవన్

క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం

పిలుపునిచ్చారు. 15 ఏళ్ల పాటు కూటమి అధికారంలో ఉండాలన్నారు. రాష్ట్రానికి అరాచక పాలన వద్దన్నారు. విద్యార్థి, యువజన, కార్మిక, కర్షక, మహిళా ఇలా అన్ని రంగాల్లోనూ పూర్తికాలం కార్యకర్తలను పెట్టాలని జనసేన భావిస్తోందన్నారు. మహిళలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ తెలుగు ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశమని పేర్కొన్నారు. ప్లాంట్ రక్షణకు చర్యలు చేపట్టామన్నారు. విశాఖ రైల్వేజోన్ పనులు ముందుకు సాగుతున్నాయన్నారు. తాము అధికారం కోల్పోతే అరాచక, చీకటి పాలన మళ్లీ వచ్చేస్తుందంటూ వైసిపిని ఉద్దేశించి పవన్ వ్యాఖ్యానించారు. దసరాకు 'త్రిశూల్' కార్యక్రమాన్ని తాను చేపడతానని పవన్ అన్నారు. భద్రత, గుర్తింపు, నాయకత్వం అంశాల ఆధారంగా త్రిశూల్ ఉంటుందని తెలిపారు. సభా వేదికపై పార్టీ మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ సహా ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ముఖ్య నేతలు ఉన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి జనసేన కార్యకర్తలు తరలివచ్చారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తొలుత పార్టీ క్రియాశీలక కార్యకర్తలతో పవన్ మాట్లాడించారు.

సేనతో సేనాని బహిరంగ సభ వేదికపై తప్పెటగుళ్ళు ప్రదర్శనతో ఆకట్టుకున్న కళాకారులు

పాత చింతకాయ ముచ్చట్లే !

తెరతీశారు. రూ.11400 కోట్ల ప్యాకేజీతో ప్రైవేటీకరణ ఆగిపోయిందని పల్లా, ఇతర టిడిపి మంత్రులు, జనసేన నేతలూ చెబుతున్నారు. అలాగైతే ఏడాది కాలంగా కార్మికులకు ఎందుకు ప్లాంట్‌లో జీతాలివ్వడం లేదు. ఈ ప్యాకేజీ డబ్బు అప్పులు, వడ్డీలకే వెళ్లింది తప్ప పాంట్ ఉత్పత్తికి ఒక్కపైసా వాడలేదన్నది నగ్నసత్యం. ఈ అంశాలను కూటమి నేతలు మరుగున పరిచి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నారు. ప్లాంట్‌లోని ఇఐఎలకు తమ ప్రభుత్వం మద్దతు ఉంటుందని పల్లా చెప్పడంతో కార్మికులు మండిపడుతున్నారు.

అమరావతి వదిలి ఎందుకింత హడావుడి

రాష్ట్రంలోనే అతిపెద్ద నగరమైన విశాఖపట్నంలో టూరిజం, ఐటి సంస్థల ఏర్పాటు, గూగుల్‌కు స్థలాలు వంటి ప్రకటనలు మినహా చంద్రబాబు ప్రభుత్వం కొత్తగా ప్రకటనలు చేసిందేమీ లేకపోవడంతో సొంత పార్టీ కార్యకర్తల్లోనే పెద్ద జోష్ కనిపించడం లేదు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక జరిగిన భారీ స్థాయి పర్యటనలుగా విశాఖలో ఈ మూడు రోజులనూ పేర్కొనవచ్చు.

లాటరీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న జెసి మయూర్ అశోక్

పారదర్శకంగా బార్ల కేటాయింపు

లాటరీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించామని, జివిఎంసి పరిధిలో రిజర్వ్‌లో పది, ఓపెన్ కేటగిరీలో 121 కలిపి మొత్తం 131 బార్లు ఉండగా ఆశావహుల నుంచి 263 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పూర్తిగా పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకున్నామని జెసి తెలిపారు. వీటిలో గీత కులాలకు పది, ఓపెన్ కేటగిరీలో 57 కలిపి మొత్తం 67 బార్లకు లాటరీ ప్రక్రియ ముగిసిందన్నారు. సంబంధిత నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని, దరఖాస్తులు రాక మిగిలిపోయిన బార్ల విషయంలో ప్రభుత్వ ఆదేశాలకు మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై అవగాహన కల్పించడం కోసం శనివారం నగరంలోని ఓ హోటల్‌లో జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. చట్టాలపై అవగాహన కల్పించారు. ఆ చట్టాల ద్వారా బాధితులకు న్యాయం ఎలా లభిస్తుందో, నేరస్తులకు ఎలాంటి శిక్షలు విధించబడతాయో తెలిపారు. ఈ చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడంలో పోలీసులు, న్యాయవ్యవస్థ పాత్ర గురించి స్పష్టం చేశారు. సదస్సులో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి కార్పొరేషన్‌లో పలు అంశాలపై సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్ కుమార్ తన విశాఖపట్నం పర్యటనలో భాగంగా శనివారం ఉదయం ఎంవిపి కాలనీలోని విశాఖపట్నం జిల్లా ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సత్య పద్మ, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు, పౌల్ట్రీ కాంప్లెక్స్‌లు, ఖాళీ స్థలాల అభివృద్ధి, ఎస్‌సి అభ్యర్థులకు ఎపిఎస్ ఆర్‌టిసి నుంచి హెచ్‌ఎంవి శిక్షణ, ఎన్ఎస్ఎఫ్‌డిసి, ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి పథకాల రికవరీ అమలు వంటి వివిధ అంశాలపై చర్చించారు.

డిసెంబర్ 14న నేవీ మారథాన్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: వైజాగ్ నేవీ మారథాన్ 14 డిసెంబర్ 2025 న నిర్వహిస్తున్నామని వైజాగ్ నేవీ మారథాన్ రేస్ ఆర్గనైజర్ కమాండింగ్ ఆఫీసర్ ఐఎన్ఎస్ ఎస్.కళింగ కమాండర్ అనిరుధ్ రాయ్ ప్రకటించారు. శనివారం డాల్ఫిన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైజాగ్‌నేవీమారథాన్ 10వ ఎడిషన్‌కు సంబంధించిన వివరాలను తెలిపారు. 2014 నుండి ఈ మారథాన్ ను నిర్వహిస్తున్నామని 10వ ఎడిషన్ వైజాగ్‌నేవీ మారథాన్ ఎంతో ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో పాల్గొనాలనుకునేవారు vizag-navymarathon.runలో రిజిస్టర్ చేసుకోవాలని చెప్పారు. ఈ మారథాన్ కు అధికారిక టైటిల్ స్పాన్సర్‌గా ఎస్‌బిఐ వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ మారథాన్ బీచ్‌రోడ్‌లోని విశ్వప్రియ ఫంక్షన్ నుండి మొదలై ఐఎన్ఎస్ కళింగ వరకు సాగుతుందని తెలిపారు. అనంతరం జివిఎంసి కమీషనర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ వైజాగ్ నేవీ మారథాన్‌లో పాల్గొనే వారి సంఖ్య క్రమేణ పెరుగుతూ వస్తుందన్నారు. మారథాన్ రిజిస్ట్రేషన్‌ను జివిఎంసి కమీషనర్ కేతన్ గార్గ్ అధికారికరికంగా ప్రారంభించారు.

ఈ వెబ్‌సైట్ సెప్టెంబర్ 1 సోమవారం నుండి అందరికి అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఐఎన్ఎస్ కళింగా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, వి.కె.తివారీ, రేసు డైరెక్టర్ టిఆర్ఎస్ కుమార్, నేవీ డిఫెన్స్ పిఆర్ఓ కెప్టెన్ సుజిత్ రెడ్డి , ఎస్‌బిఐ డిజిఎం రాహుల్ సంక్రిత్య పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అనిరుధ్‌రాయ్, కేతన్‌గార్గ్ తదితరులు

లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు, శనివారం చైర్మన్ కం జిల్లా ప్రధానన్యాయమూర్తి చాంబర్‌లో చిన్నంశెట్టిరాజు, జుడీషియల్ అధికారులతో భౌతికంగా,అన్ని మండలాల జుడీషియల్ అధికారులతో వర్చువల్‌గా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ, పెండింగ్ కేసుల పరిష్కారంలో లోక్‌అదాలత్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి,కక్షిదారులకు లోక్ అదాలత్ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని ఆయన జుడీషియల్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వచ్చే నెల 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ కేసులను పరిష్కరించడానికి కృషి చేయాలని జుడీషియల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని న్యాయస్థానాల జుడీషియల్ అధికారులు, న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు పాల్గొన్నారు.

1న కెజిహెచ్ కాంప్రహెన్సివ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: రాష్ట్ర వైద్య ,ఆరోగ్య ,కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సెప్టెంబర్ 1 న ఉదయం 8.30 గంటలకు వాయుమార్గం ద్వారా విశాఖపట్నం చేరుకుంటారు. 10 గంటల నుండి 12 గంటల వరకు కెజిహెచ్‌లో కాంప్రహెన్సివ్ క్యాన్సర్ సెంటర్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అనకాపల్లి వెళతారు.

విద్యార్థికి వాసుపల్లి భరోసా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : క్యాన్సర్ కారణంగా మంచానికి పరిమితం అయిన ఒక ఆటోడ్రైవర్ కుటుంబాన్ని ఆదుకునేందుకు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి ముందుకు వచ్చారు. చదువు మధ్యలోనే ఆపేసిన ఆ ఇంటి పిల్లల చదువుకు భరోసానిచ్చారు. బైపిసి చదువుతున్న ఆటోడ్రైవర్ కుమార్తెను డాక్టర్ చేస్తానని హామీ ఇచ్చారు. ఇంటర్ పూర్తి చేసేందుకు రూ.80 వేల ఉచిత ఫీజుతో రామబాణంలో ఇంటర్ సీటును కల్పించారు. దక్షిణ నియోజక వర్గం పరిధి 31 వార్డులో డాబాగార్డెన్స్‌లో ఆటోడ్రైవర్ పి.సూరి అప్పారావు కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. కొంతకాలంగా ఆయన క్యాన్సర్‌తో బాధపడుతూ ఇంట్లో మంచానికే పరిమితం అయ్యాడు.మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి శనివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి అతని కుమార్తెకు ఆశీల్‌మెట్ట ప్రాంతంలో తన రామబాణం కళాశాలలో ఉచిత సీటు ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం అతని కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. వాసుపల్లికి ఆటోడ్రైవర్ అప్పారావు, అతని కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

యాచకులకు ఆధార్ నమోదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగర పోలీసు కమిషనర్ తలపెట్టిన 'మిషన్ తమసోమ జ్యోతిర్గమయ' కార్యక్రమంలో భాగంగా ఎయుటిడి జివియంసి షెల్టర్ హోంలో వసతి కల్పించిన యాచకులు, మానసిక రోగులు 210 మంది అనాథలలో 128 మందికి ఆధార్ నమోదు సెంటర్‌ను పోలీసుల సహకారంతో స్పెషల్ డ్రైవ్‌గా ఏర్పాటు చేశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో సిపి స్వయంగా పాల్గొన్నారు

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P. 22/2020 O.S.67/2015
DHR : మళ్ల శివ సత్యనారాయణ
JDR'S : గెద్దం అప్పారావు (Died) వగైరాలు
నోటీసు
JDR'S 2 & 3
2.గెద్దం కిరణ్ కుమార్ S/o (L) అప్పారావు R/o పాతవీధి, యలమంచిలి గ్రామం, పోస్టు, మండలం, విశాఖపట్నం జిల్లా.
3.వట్నా హైమావతి D/o (L) అప్పారావు W/o శంకరాచారి, Rest-do-
పై నంబరు అమలులో జె.డి.ఆర్.లు 2, 3 అసామీలకు 0.21, R.52 ప్రకారం O.S.79/2015 స్పెసిఫిక్ పెర్ఫార్మెన్స్ కేసులో, డిక్రీహోల్డరుకు రావలసిన మొత్తంలో పై నంబరు దావాలో డిపాజిట్ రూ॥50,000/-లు, రిమైనింగ్ సేల్ Consideration మొత్తం శ్రీ కోర్టువారు జప్తుచేస్తూ, పై నంబరు దావా O.S.79/2015 తమ కోర్టులో జరిగి పూర్తి అయినది. కావున శ్రీవారు పై నంబరు O.S.79/2015 రూ॥50,000/-లు. ఈ అమలులోకి తీసుకువచ్చుటకు ఎన్ని మార్లు నోటీసులు వచ్చినను వచ్చుకొనక కాలయాపన చేయుచున్నారు కాబట్టి సదరు జె.డి.ఆర్లు 2, 3 లకు వాయిదా రోజు అనగా **తే.18-9-2025దిన ఉ॥10-30 గం॥లకు** శ్రీ కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులపై)
యల్లపు నాగేశ్వరరావు
యలమంచిలి అడ్వకేటు, యలమంచిలి
తేది.29-08-2025 సెల్ : 9553383837

స్వచ్ఛతపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఇఒ

ప్రజాశక్తి- వేపగుంట: సింహాచల వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు మరింత మెరుగు, స్వచ్ఛతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను దేవస్థానం ఇఒ వేంద్ర త్రినాధరావు ఆదేశించారు. శనివారం ఆలయ పరిసరాలను సమగ్రంగా పరిశీలించారు. దేవస్థానం ప్లాస్టిక్ రహితంగా కొనసాగాలని సూచించారు. కొండ దిగే మెట్ల మార్గ పనులు వేగంగా పూర్తి చేయాలని ఇఇలను ఆదేశించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టుకునే ప్రదేశాన్ని పరిశీలించి, సౌకర్యవంతంగా ఉండేలా కొత్త డిజైన్ చేయాలని సూచించారు. ఉత్తర రాజగోపురం ఎదురుగా దాతల సహకారంతో నిర్మిస్తున్న షెడ్డు పనులను పరిశీలించారు ఎఇఒ పంతం శ్రీనివాసరావు, పర్యవేక్షణ అధికారి రాజ్యలక్ష్మి, ఇఇలు రమణ, రామకృష్ణ ఉన్నారు.

మాతృభాషను గౌరవించాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి మధుకుమార్ మాట్లాడుతూ గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు భాషను జనులందరి వాడుక భాషలోకి తేవడానికి గిడుగు రామూర్తిగారు చేసిన సేవలు అనిర్వచనీయమని కొనియాడారు

సభాధ్యక్షులు ప్రిన్సిపాల్ డాక్టర్ జిఎస్కె. చక్రవర్తి మాట్లాడుతూ, తెలుగు భాష సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిక అని, మాతృభాషను ప్రతిఒక్కరూ గౌరవించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. సురేఖ మాట్లాడుతూ దేశభాషలందు తెలుగు లెస్స అని శ్రీకష్ణదేవరాయలతో కీర్తించబడిన తెలుగుభాష మాధుర్యం, శబ్ధ సౌందర్యం, భావ గంభీరత, సరళత మరే భాషకు లేదన్నారు. వ్యాసరచన, వక్తృత్వ, పద్య పఠన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. జాతీయ గీతాలాపనతో కారక్రమం ముగిసింది.కార్యక్రమంలో గౌసీ బాబు, శ్రీనివాస్‌రెడ్డి, రమణమూర్తి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సోమేశ్వరరిడ్డి, ఇంజినీర్ కళాశాల ప్రిన్సిపాల్ దీపక్ చౌదరి, పిజి కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, తెలుగు అధ్యాపకులు డాక్టర్ పైడిరాజు, డాక్టర్. మాలతి, డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

అన్నసమారాధన

రాజవీధిలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కొప్పల రమేష్

ప్రజాశక్తి- తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు రాజవీధిలో గణేష్ ఉత్సవాల్లో భాగంగా శనివారం టిడిపి నాయకులు కొప్పల రమేష్, కృష్ణ ఆర్థిక సాయంతో అన్నసమారాధన నిర్వహించారు. పార్టీ నాయకులు రమేష్ ప్రారంభించిన కార్యక్రమంలో ఒకటో వార్డు అధ్యక్షులు తమ్మిన సూరిబాబు , మాజీ కౌన్సిలర్ రాంబాబు, శ్రావణ్, భాను ప్రకాష్ పాల్గొన్నారు

సీతమ్మధార :సీతమ్మధార రైతు బజార్‌లో శనివారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఏటా సీతమ్మధార రైతు బజారులో నిర్వహించే వినాయక చవితి వేడుకల్లో అన్నసంతర్పణ ఆనవాయితీగా నిర్వహిస్తున్నామన్నారు. రెండు వేలమంది పాల్గొన్ని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. రైతుబజార్ సహాయకుడు సతీష్, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

మూలకు చేరిన సోలార్ యూనిట్లు

నీటి అవసరాలకు విద్యార్థుల అవస్థలు

శిథిలమైన రూఫ్ టాప్ సోలార్ యూనిట్

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం హైస్కూల్ సమీపంలోని బాలికల, బాలుర వసతి గృహాల్లో ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్లు మూలకు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలికాలంలో విద్యార్థులకు వేడి నీరు అందించాలనే ఉద్దేశంతో వసతి గృహాల్లో సోలార్ యూనిట్లు, వాటర్ హీటర్లు ఏర్పాటుచేశారు. హుదూద్ తుపాన్ సమయంలో సోలార్ ప్యానెల్ దెబ్బతిన్నాయి. అప్పటి నుండి మరమ్మత్తులు చేపట్టకపోవడంతో యూనిట్లు మూలకు చేరాయి. ప్రస్తుతం బాలికల వసతి గృహంలో సుమారు 80 మంది, బాలుర వసతి గృహంలో 130 మంది విద్యార్థులు ఉంటున్నారు. సోలార్ యూనిట్లు పనిచేయకపోవడంతో వసతి గృహాల్లో ఏర్పాటుచేసిన హీటర్లు కూడా ఉపయోగం లేకుండా పోయాయి. విద్యార్థులకు తక్షణమే వేడి నీరు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

బాలురు హాస్టల్‌లో నిరుపయోగంగా వాటర్ హీటర్

మంచినీటి సమస్య

బాలికల వసతి గృహంలో ప్యూరిఫైడ్ వాటర్ ట్యాంక్ లేకపోవడంతో విద్యార్థులు ఇప్పటికీ కుళాయి నీటినే తాగాల్సి వస్తోంది. దాతలు ముందుకు వచ్చి ప్యూరిఫైయర్ ఏర్పాటు చేస్తే శుభ్రమైన తాగునీరు అందుతుందని విద్యార్థులు చెబుతున్నారు.

ప్రశాంత్‌కు పవన్ కల్యాణ్ అభినందన

ప్రశాంత్‌ను అభినందిస్తున్న పవన్

ప్రజాశక్తి-మధురవాడ : దుబాయ్, అబూదాబిలలో వచ్చేనెల 9 నుంచి ప్రారంభమయ్యే ఆసియా కప్ 20-20 క్రికెట్ పోటీలకు టీమిండియా మేనేజర్‌గా నియమితులైన పివిఆర్. ప్రశాంత్‌ను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అభినందించారు. విశాఖ పర్యటనలో ఉన్న పవన్‌ను శనివారం ప్రశాంత్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ, తెలుగు వ్యక్తికి ఇలాంటి అరుదైన గౌరవం దక్కడంపై ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ప్రశాంత్ మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) ఉపాధ్యక్షుడిగా పనిచేసిన ప్రశాంత్, భీమవరం జనసేన ఎమ్మెల్యే, పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) కుమారుడు కాగా, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అల్లుడు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో వైద్య శిబిరం

ఆరోగ్య తనిఖీలు చేస్తున్న మెడికవర్ వైద్యులు

ప్రజాశక్తి - విశాఖ కలక్టరేట్: అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మెడికవర్ ఆసుపత్రి సహకారంతో శనివారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. విజ్ఞాన కేంద్రం మెడికల్ విభాగం నాయకులు టి.కామేశ్వరరావు దీనిని ప్రారంభించారు. బిపి, షుగర్, ఇసిజి, దంత, నేత్ర పరీక్షలతో పాటు, క్యాన్సర్ పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహించారు. మందులు అందజేశారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ ఈ పరీక్షలు ప్రతి మూడు మాసాలకు ఒకసారి అవసరమని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి, పలువురు డాక్టర్లు, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు చంద్రమౌళి, కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎస్‌ఎల్ సిబ్బందికి శిక్షణ

శిక్షణలో పాల్గొన్న మిడ్ లెవెల్ ఎగ్జిక్యూటివ్‌లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, మహారాష్ట్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సహకారంతో 20 మంది మిడ్ లెవల్ ఎగ్జిక్యూటివ్‌లకు శనివారం నిర్వహణ, అభివృద్ధి అంశాలపై శిక్షణ అందించారు. సామర్థ్యం పెంపు, వృత్తిపరమైన అభివృద్ధిని పెంపొందించే లక్ష్యంగా ఈ శిక్షణ సాగింది. కార్యక్రమంలో భాగంగా హిందూస్తాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ సిఎమ్‌డి కమాండర్ గిరిదీప్ సింగ్ మాట్లాడుతూ జ్ఞానం, నిర్వహణ సామర్థ్యాలను, ప్రాముఖ్యతను వివరించారు. ఈ శిక్షణను హెచ్‌ఎస్‌ఎల్ సిబ్బంది వ్యక్తిగత, సంస్థాగత వృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు.

అప్పన్న సన్నిధిలో ప్రభుత్వ విప్ గణబాబు

ప్రజాశక్తి- వేపగుంట :సింహాద్రి అప్పన్నను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి.గణబాబు దంపతులు శనివారం దర్శించుకున్నారు. వారికి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ, ఎఇఒలు స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు అనంతరం వేదాశీర్వచనం పొందారు. ఆలయ అధికారులు స్వామి శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని ఐటిబిపి కానిస్టేబుల్ మృతి

- ఆర్థిక ఇబ్బందులే కారణమా ?

వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ, మృతుడు నరేంద్రనాథ్

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని పందలపాక గ్రామం దరి 56వ బెటాలియన్ ఐటిబిపి హెడ్‌క్వార్టర్స్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. కానిస్టేబుల్ (జిడి)గా పనిచేస్తున్న జగదల నరేంద్రనాథ్ (32) శుక్రవారం సాయంత్రం గార్డు విధులు నిర్వహిస్తుండగానే ఉరేసుకుని ఆత్మహత్యకు ఒడిగట్టాడు.కర్నూల్ జిల్లా దోన్ మండలం, ఆర్ఎస్.రంగాపురం గ్రామానికి చెందిన నరేంద్రనాథ్, 2014లో కానిస్టేబుల్‌గా నియమితులై, గత 15 నెలలుగా ఆనందపురం 56వ బెటాలియన్ యూనిట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు గార్డుగా విధులు నిర్వహిస్తున్న ఆయన, అనంతరం సుమారు 7.35 గంటలకు బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌లోని మామిడి చెట్టుకు నైలాన్ వైర్‌తో ఉరివేసుకొని సంఘటనాస్థలిలోనే మృతి చెందాడు.

బెటాలియన్ అధికారి సంఘటనా స్థలాన్ని పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై బెటాలియన్ ఇన్‌ఛార్జి సూరజ్‌ప్రకాష్ జోషి ఆనందపురం పోలీసులకు సమాచారం అందించారు. కాగా మృతుడు నరేంద్రనాథ్‌కు భార్య స్వాతి, ఇద్దరు చిన్న పిల్లలున్నారు. వ్యసనాలకు బానిసై, ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా నరేంద్రనాథ్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడని, ఈ పరిస్థితుల వల్లే ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు.మృతుని భార్య స్వాతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఎస్ఐ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఆరిలోవ కాలనీకి చెందిన బుట్టా చిన్నారావు శుక్రవారం ఉదయం ఆరిలోవ కాలనీ చివరి బస్‌స్టాపు వద్ద మద్యం మత్తులో ఒంటికి పెట్రోలు పోసుకొని ఆత్మహత్య యత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఒంటి మీద తీవ్రగాయాలతో కెజిహెచ్‌కు తరలించిన చిన్నారావు చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడ్డాడు. మృతుడు చిన్నారావుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. చిన్నారావు దహన సంస్కారాలకు ఉపకార ఛారిటబుల్ ట్రస్టు అధినేత కంచర్ల అచ్యుతరావు, మేస్త్రీ శివ ఆర్థిక సహాయం అందించినట్టు స్థానిక సంఘ నాయకులు తెలిపారు.

12 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలో జల్లూరు గ్రామం వద్ద 12 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. స్కూటీపై ముగ్గురు వ్యక్తులు గంజాయి తరలిస్తుండగా, పోలీసులు పట్టుకున్నారు. ఈ సమయంలో ఒక వ్యక్తి తప్పించుకొని పారిపోగా, ఇద్దరిని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై రమేష్ తెలిపారు. పట్టుపడ్డ గంజాయి చింతపల్లి ప్రాంతం నుంచి తీసుకొస్తున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేత్రపర్వంగా సహస్ర నామార్చన

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్న ఆర్జిత సేవలో భాగంగా శనివారం సహస్ర నామార్చన నేత్రపర్వంగా సాగింది. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేసి, పాంచరాత్ర ఆగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామి ప్రసాదాలను అందజేసి, తర్వాత అంతరాలయ దర్శనం కల్పించారు.

శక్తిని వృథా చేయరాదు

● సెయిల్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్

సెయిల్ జిఎంను సత్కరిస్తున్న విశాఖ ఇంజినీరింగ్ కాలేజీ ప్రతినిధులు

ప్రజాశక్తి- వేపగుంట : శక్తిని అవసరం ఉన్నంత మేరకే వినియోగించాలని, వృథా చేస్తే భావితరాలకు ఇబ్బంది తప్పదని సెయిల్ జనరల్ మేనేజర్ టి.శ్రీనివాస్ సూచించారు. శనివారం నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ ఇన్ టెక్నాలజీ కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎనర్జీ కన్జర్వేషన్‌పై సెమినార్‌లో మాట్లాడారు ఎనర్జీ కన్జర్వేషన్‌పై ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జివి. ప్రదీప్ వర్మ, డీన్ అకడమిక్స్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ డి శాంతారావు, ఈ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్స్ కె. చందన, బి. భువనేశ్వరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్టోబర్ 15న ఎయు స్నాతకోత్సవం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం 91,92వ సంయుక్త స్నాతకోత్సవం అక్టోబర్ 15న ఉదయం 11 గంటలకు కట్టమంచి రామలింగారెడ్డి ఉత్సవ రంగం (కాన్వకేషన్ హాల్) వేదికగా జరగనుంది. స్నాతకోత్సవానికి ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆరోజున ఉదయం 9 గంటలకు తమకు కేటాయించిన స్థానాలలో కూర్చోవాలని సూచిస్తూ రిజిస్ట్రార్ నోటిఫికేషన్‌ను విడుదల చేసారు. స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ హాజరవుతారన్నారు. ఇటీవల ఎయు విసి ఆచార్య జిపి రాజశేఖర్ స్వయంగా రాజ్ భవన్‌కు వెళ్లి స్నాతకోత్సవం నిర్వహణ తదితర అంశాలు గవర్నర్‌కు వివరించి స్నాతకోత్సవ నిర్వహణకు అనుమతి తీసుకుని, రావాలని ఆహ్వానించారన్నారు.

ఎన్ఎస్ఆర్ఐటిలో పట్టభద్రుల వేడుక

విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న ప్రొఫెసర్ జయ సుమ

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని శొంఠ్యాంలోని నడింపల్లి సత్యనారాయణరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఎస్ఆర్ఐటి)లో శనివారం పట్టభద్రుల వేడుక ఘనంగా నిర్వహించారు. కళాశాల వ్యవస్థాపకులు నడింపల్లి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో జెఎన్‌టియు జివి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయసుమ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యా విధానాలు, పరిశ్రమ-విద్యాసంస్థల అనుసంధానం, భవిష్యత్ సాంకేతిక నైపుణ్యాలపై విద్యార్థులకు సూచనలు చేశారు.

హెచ్‌సిఎల్ గువి హెచ్ఆర్ హెడ్ కాంచన ఖేడేకర్ విద్యార్థులను క్రమశిక్షణ, సమయపాలనతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. జామియా మిల్లియా ఇస్లామియా సిఎస్ఇ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ అంజాద్ కంప్యూటర్ సైన్స్ తాజా ధోరణులు, ఐటీ రంగంలో అవకాశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అర్హత సాధించిన పట్టభద్రుల విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎన్. ప్రసాదరాజు, కోశాధికారి ఎన్.కనకరాజు , ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభు ప్రసాద్, సిఎంఒ.డాక్టర్ పిఎస్.రాజు, పలు విభాగాధిపతులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణతో పోటెత్తిన నీరు

ముంపుబారిన పైర్లు..

నీట మునిగిన తోటలో బీరకాయలు ఏరుతున్న రైతులు బాలి నారాయణమ్మ

● కూరగాయలు, పూలతోటలకు తీవ్ర నష్టం

● లబోదిబోమంటున్న రైతులు : పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని పందలపాక రెవెన్యూ పరిధిలో బుత్తల వారి చెరువు దురాక్రమణ స్థానిక రైతుల జీవితాలను దెబ్బతీస్తోంది. వరుస వర్షాలతో చెరువులో నిల్వ ఉండాల్సిన నీరు, ఆక్రమణల పుణ్యమాని నేరుగా పంట పొలాల్లోకి చొరబడి పైర్లను ముంచేస్తోంది. దీంతో చేతికి అందివచ్చే కూరగాయలు, ఇతరత్రా పంటలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పందలపాక రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 17/15లో 1.41 ఎకరాల్లో విస్తరించిన బుత్తల వారి చెరువును కొంతమంది ఆక్రమణదారులు మట్టితో కప్పివేయడంతో చెరువు గర్భం కుచించుకుపోయింది. దీంతో గ్రామాల నుండి వచ్చే వర్షపు నీరు చెరువులో నిల్వ కాకుండా, నేరుగా పంట పొలాల్లోకి చేరుతోంది. దీంతో రైతులు సాగుచేసిన బీరకాయ, వంగ, మందార, తదితర పంట తోటలు నీటిలో మునిగి నష్టపోయాయి. గంటపేట, యాతపేట పందలపాక గ్రామాల నుండి

వర్షపునీరు నిలిచి తంపరగా మారిన పంటపొలాలు

వచ్చే వర్షపు నీరు బుత్తల వారిచెరువులో చేరవలసి ఉండగా, చెరువు మూసివేత కారణంగా బాలి నారాయణమ్మ, గంట అప్పారావు, గంట అప్పలరాజు, బాలి లక్ష్మి, గంట వెంకట్రావు, ఇరుమజ్జి సూరిబాబు,శ్రీను తదితర రైతులకు చెందిన పంట పొలాలు ముంపుబారిన పడి పంటనష్టం వాటిల్లుతోంది.

అలాగే బుత్తల వారి చెరువు నిండిన నీరు తర్వువాడ చిరువ చెరువుకు నీరు వెళ్లే కాలువలు కూడా మూసుకుపోవడంతో, నీరు సాఫీగా సాగే మార్గం లేకపోవడంతో పంట పొలాల్లోకి చేరి, వాటిని చెరువుల్లా మార్చేస్తోందని రైతులు వాపోతున్నారు. బుత్తల వారి చెరువుతోపాటు దాని దిగువనున్న కాలువల్లోని ఆక్రమణలను తొలగించి, వాటికి అవసరమైన మరమ్మతులు చేపడితే వర్షాల సీజన్‌లో పంట నష్టాల నుంచి తమకు విముక్తి లభిస్తుందని బాధిత రైతులు అంటున్నారు. దీనిపై. అధికారులు, నేతలు స్పందించి, తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

విత్తన బంతులతో సామాజిక వనాల పెంపకం

కొండపై విత్తన బంతులతో నరవ విశాఖ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు

ప్రజాశక్తి - వేపగుంట : పర్యావరణ పరిరక్షణకు సామాజిక వనాల పెంపకంలో భాగంగా శనివారం నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు కాలేజీ పక్కనున్న కొండపై విత్తన బంతులు వేశారు. సిబిఐ మాజీ జెడి వి.వి.లక్ష్మీనారాయణ సూచనతో, జెడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గంగరావి, మారేడు, మొక్కజొన్న, తురాయి, సీతాఫలం, సపోటా, వేప, బాదం, చింత, కుంకుడు తదితర విత్తనాలతో తయారుచేసిన విత్తన బంతులు వేశారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపల్ పి..ప్రదీప్ వర్మ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు అవగాహనతో విద్యార్థులు పాటు పడాలన్నారు. కార్యక్రమంలో జెడి ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కారుమూడి అను, పాలిటెక్నికల్ ప్రిన్సిపాల్ పి ప్రసాద్, డీన్ డాక్టర్ డి శాంతారావు, ఒఎస్‌డి గాయత్రి రాం, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వీరు నాయుడు, కాలేజీ విద్యార్థులు, తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

సమస్యలపై లోకేష్‌కు వినతి

మంత్రి లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న పైడిరాజు, తదితరులు

ప్రజాశక్తి- వేపగుంట : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విశాఖ జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు, టిడిపి ఉపాధ్యక్షులు నరవ పైడిరాజు కోరారు. విశాఖ పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సెలూన్ షాప్‌లకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వడంపై మంత్రి లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. 200 యూనిట్లు విద్యుత్ వాడకం తర్వాత అదనపు వినియోగాన్ని గృహవసర బిల్లులుగా పరిగణనలోకి తీసుకునేలా ప్రభుత్వపరంగా చర్యలు చేపట్టాలని కోరారు. అక్టోబర్ 22న ఆయుర్వేద మూల పురుషుడు ధన్వంతరి జయంతిని ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలని కోరారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 50ఏళ్లు దాటిన నాయీ బ్రాహ్మణులకు పెన్షన్లు, సెలూన్లు పెట్టుకోవడానికి 50శాతం సబ్సిడీతో రూ.పది లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని కోరారు.

తగరపువలస : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ ఉద్యోగ విరమణ ప్రయోజనాల చెల్లింపు, ఏజెన్సీలోని గిరిజనులకు శతశాతం విద్య, ఉద్యోగ అవకాశాలను కల్పించే జిఒ 3 ప్రయోజనాలను పునరుద్ధరించాలని కోరుతూ మంత్రి లోకేష్‌కు రెండో వార్డు టిడిపి నేతలు చెట్టి అశోక్ చక్రవర్తి వినతిపత్రం అందజేశారు.విశాఖ నగర టిడిపి కార్యాలయంలో సమస్యలను విన్నవించినట్లు తెలిపారు.

ఉర్రూతలూగించిన లైవ్ ఆర్కెస్ట్రా

ప్రజాశక్తి-ములగాడ: మల్కాపురం గాయనీ గాయకులతో ఏర్పాటైన ఎంకెపి మ్యూజికల్ ఈవెంట్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన లైవ్ ఆర్కెస్ట్రా ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. స్థానిక గ్రామపెద్దలు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన కార్యక్రమంలో స్థానిక వర్ధమాన గాయనీగాయకులు పలు సినీగీతాలను ఆలపించి, ప్రేక్షకులను మైమరిపింప జేశారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు మాట్లాడుతూ, వినాయక ఉత్సవాల సందర్భంగా ఇంతవరకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఒక ఎత్తయితే, అందరూ మల్కాపురం గాయకులతో నిర్వహించిన ఈ లైవ్ ఆర్కెస్ట్రా ప్రోగ్రాం మరింత ప్రత్యేకమని ప్రశంసించి, ప్రోత్సాహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మల్కాపురం గ్రామపెద్దలు

పిలక రామ్మోహన్ రెడ్డి, ఎన్‌వి రమణ, చెట్టు నూకరాజు, బోస అప్పలరెడ్డి, టిడిపి నాయకులు కాకి పోలిరెడ్డి, మజ్జి సోమేశ్, సర్వసిద్ధి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖపట్నం జిల్లాలోని ఎపిఇపిడిసిఎల్ రెవెన్యూ కార్యాలయాలలో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు ఈనెల 31న ఆదివారం పనిచేస్తాయని విశాఖపట్నం సూపరింటెండింగ్ ఇంజనీర్ జి. శ్యాంబాబు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను సంస్థ రెవెన్యూ కార్యాలయాలు, ఉప విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, రాజీవ్ ఇపిడిసిఎల్ కౌంటర్లు,ఎటిపి సెంటర్లలో ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు. అలాగే ఎపిఇపిడిసిఎల్ వెబ్‌సైట్, ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్ ద్వారా కూడా బిల్లులు చెల్లించవచ్చన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బిల్లులను సకాలంలో చెల్లించాలన్నారు.

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి-భీమునిపట్నం : ముఖ్యమంత్రి సహాయనిధి కింద జివిఎంసి మూడోవార్డు తోటవీధికి చెందిన కర్రి ఎర్రిబాబుకు మంజూరైన రూ 89,909 ఆర్థికసాయం చెక్కును శనివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అందజేశారు. విశాఖ నగరంలోని ఎంవిపి కాలనీలో ఉన్న తన నివాసంలో లబ్ధిదారునికి చెక్కును అందజేసారు కార్యక్రమంలో టిడిపి నాయకులు చిక్కాల విజయ్‌బాబు, ఎన్ స్వామి, గంటా నూకరాజు పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలోని పాలవలస పంచాయతీ గుడిలోవ గ్రామానికి చెందిన కోరాడ అప్పలరాజు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.51,200 ఆర్థికసాయం చెక్కును

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా

శనివారం అతని కుమారుడు ఆనంద్‌కు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అందజేశారు. తాట్రాజు అప్పారావు, బిఆర్‌బి నాయుడు, మద్ది శేఖర్, కోరాడ రమేష్, పాలవలస నారాయణరావు, మజ్జి రవి పాల్గొన్నారు.

దోమతెరలు సక్రమంగా వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, కెజిబివి విద్యార్థులు దోమతెరలను సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం వివిధ పరిశ్రమల ప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి విద్యార్థులకు దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి రాబోయే రోజుల్లో మరింత మందికి సహాయం చేసేలా ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రెండో సంవత్సరం జిల్లాలో విద్యార్థులందరికీ 10,429 దోమ తెరలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 50 బిసి హాస్టళ్లకు 2400, 30 ఎస్‌సి హాస్టళ్లకు 2,122, 5 మహాత్మా జ్యోతిరావు పూలె బిసి సంక్షేమ వసతి గృహాలకు 1075, 19 గిరిజన సంక్షేమ వసతి గృహాలకు 1,220, 8 సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలకు 1712, 20 కెజిబివిలకు 1700, 4 ఆశ్రమ పాఠశాలలకు 200 అందించినట్లు చెప్పారు. వసతి గృహాల్లో పారిశుధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి జి.రామారావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రసాద్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రామానందం, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, వార్డెన్లు , విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దోమ తెరలు పంపిణీ చేసిన కలెక్టర్ విజయకృష్ణన్

టికెట్ చూపుతున్న మంత్రి అనిత

ఆర్టీసీ బస్సులో హోంమంత్రి ప్రయాణం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసి మండలంలోని అడ్డురోడ్డు జంక్షన్లో శనివారం దిగారు. శనివారం నక్కపల్లి మండలం టోల్ ప్లాజా సమీపంలో భారతీ కన్వెన్షన్‌లో జరిగిన స్త్రీ శక్తి కార్యక్రమంలో ఆమె పాల్గొని కార్యక్రమం ముగిసిన అనంతరం ఆమె ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసి మహిళా ప్రయాణికులతో ఉచిత బస్సుపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం అడ్డురోడ్డు జంక్షన్ వద్ద టీ తాగుతూ స్థానికులను పలకరించారు.

ముగిసిన గ్రంథాలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని వాడ్రాపల్లిలోని "పెతకంశెట్టి జోగినాయుడు మాస్టారు గ్రంథాలయం" 14వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం రాత్రి ముగిశాయి. గ్రంథాలయ నిర్మాణ కర్త కీర్తిశేషులు పెతకం శెట్టి బాబురావు చిత్రపటానికి కిమ్స్ ఐకాన్ ఎండి డాక్టర్ సతీష్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రవాస వాడ్రాపల్లి కార్మిక వర్తక సంక్షేమ సేవా సంఘం, డాక్టర్ సతీష్ కుమార్ సౌజన్యంతో 2024-25 సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన టెన్త్, ఇంటర్, డిగ్రీ, పాలిసెట్ విద్యార్థులకు పారిపల్లెమ్మ జ్ఞాపిక షీల్డ్‌లు అందజేశారు. గ్రామంలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి మొదటి, రెండవ స్థానాల్లో నిలిచిన కాండ్రేగుల నాగ గౌరీప్రసన్న, బి.కవితలను నగదు, బహుమతితో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ గౌరవాధ్యక్షులు పెతకంశెట్టి రామజోగి నాయుడు, సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, ఈఎన్టీ స్పెషలిస్ట్ డాక్టర్ సాయి రామకృష్ణ, బోడ్డేడ సత్యనారాయణ, కొయిలాడ దశావతారం, మళ్ల రాజేష్, మళ్ల కన్నుం నాయుడు, మళ్ల శేషు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రిమ్స్‌లో తబిత నిహాల్‌కు సీటు

ప్రజాశక్తి-పాయకరావుపేట : పాయకరావుపేట పట్టణానికి చెందిన గోడత తబిత నిహాల్ ఈ ఏడాది మే నెలలో జరిగిన నీట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించింది. ఈ ఏడాది నీట్‌లో పాయకరావుపేట నుంచి తబిత నిహాల్ మాత్రమే అర్హత పొంది రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించింది. పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన తబిత నిహాల్ 10వ తరగతి పట్టణంలోని కనొస్సా ఇంగ్లీషు మీడియం స్కూల్లో చదివి 600/600 మార్కులు శత శాతం సాధించి రికార్డు సృష్టించింది. తుని శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివి 978/1000 సాధించి కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచింది. గాజువాకలోని ఆకాష్ కళాశాలలో కోచింగ్ తీసుకొని నీట్‌లో 4623 ర్యాంకు సాధించింది. తబిత నిహాల్ తాతయ్య వరిగేటి చంటిబాబు మెడికల్ డిపార్ట్మెంట్లో ఎంపిహెచ్ఈఒగా ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. అమ్మమ్మ వరిగేటి శ్యామల ప్రధానోపాధ్యాయురాలిగా రిటైర్ అయ్యారు. తల్లి వరిగేటి కృష్ణప్రభ ప్రస్తుతం మంగవరం జెడ్‌పి హైస్కూల్లో మ్యాథ్స్ టీచరుగా పని చేస్తున్నారు. ఎంబిబిఎస్ సీటు సాధించిన తబిత నిహాల్‌ను తల్లిదండ్రులు, మేనమామలు బంధువులు, స్నేహితులు అభినందించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో శనివారం విస్తృత తనిఖీలు జరిగాయి. మండల వ్యవసాయ అధికారి ఎల్వై. కాంతమ్మ ఆధ్వర్యంలో విజిలెన్స్ ఎస్సై బి.రవికుమార్, కానిస్టేబుల్ ప్రసాద్ సంయుక్తంగా దుకాణాలను పరిశీలించారు. మొదట గ్రోమోర్ షాప్‌లో రికార్డులను తనిఖీ చేయగా లోపాలు బయటపడ్డాయి. జూలై 8న రైతులకు ఇవ్వాల్సిన బిల్లు 9న నమోదు చేసినట్టు అధికారులు గుర్తించారు. దీంతో ఆ దుకాణానికి ఎరువుల అమ్మకాలపై స్టాప్ సేల్ ఆదేశాలు జారీ చేశారు. మరో ప్రైవేటు డీలర్ సురేష్ జనరల్ స్టోర్స్ వద్ద తనిఖీ చేపట్టగా అన్ని రికార్డులు సక్రమంగా ఉన్నట్టు తేలింది.

ఎస్.రాయవరం : మండలంలో గుడివాడ జంక్షన్లో గల ప్రైవేట్ ఎరువులు షాపులను జిల్లా వ్యవసాయ అధికారి బి మోహన్ రావు శనివారం తనిఖీ చేశారు. యూరియా బస్తాలు ఎన్ని ఉన్నాయో రికార్డులు పరిశీలించి, అనంతరం షాప్ యజమానికి స్టాక్ బోర్డ్ అందరికీ కనిపించే విధంగా ఉంచాలని సూచించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సౌజన్య, నక్కపల్లి వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత ఉపకరణాల పంపిణీకి నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఉచిత ఉపకరణాలు పంపిణీకి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త డాక్టర్ ఆర్ జయప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుండి జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు, ఇందులకు ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. శిబిరానికి వచ్చిన పిల్లలకు, తల్లిదండ్రులకు భోజన వసతి, ప్రయాణ ఖర్చులు చెల్లించడం జరుగుతుందని వెల్లడించారు. జిల్లాలోని 6 నియాజక వర్గాలలో వైద్యనిపుణల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3 నుండి 10వ జరుగుతాయని చెప్పారు. 3న చోడవరం జెడ్‌పి బాలికోన్నత పాఠశాలలోనూ, 4న వి.మాడుగుల జెడ్‌పి హైస్కూల్, 6న అనకాపల్లి మున్సిపల్ టౌన్ బాలికల ఉన్నత పాఠశాల, 8న యలమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 9న పాయకరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, 10న నర్సీపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనూ ఈ శిబిరాలు జరుగుతాయని పేర్కొన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని ఆందోళన

నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐటియు నేత గనిశెట్టి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరుతూ మండలంలోని ఆనందపురంలో ఆటో కార్మికులు సిఐటియు ఆధ్వర్యాన శనివారం ఆందోళన చేపట్టారు. ముందుగా రైవాడ కెనాల్ నుండి ఆనందపురం మూడు రోడ్ల కూడలి వరకు ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం వల్ల ఆటోలకు బేరాలు లేక రాష్ట్రంలో 10 లక్షల మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం సంవత్సరానికి రూ.24 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు మాట్లాడుతూ ఆటోలు కొనుగోలుకు రూ.5 లక్షలు చొప్పున సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. సిఐటియు మండల కార్యదర్శి ఈ.నాయుడు బాబు మాట్లాడుతూ ఆటో కార్మికుల నెలవారీ కిస్తీలు ప్రభుత్వం కొంతమేరకైనా భరించాలన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రంది రాజు, లెక్కల పైడితల్లి, నాయకులు పాటురి అవతారం, కె.అమ్మతల్లినాయుడు, చిటిమరెడ్డి రమణ, ఎం.రాజు, నీలి కోటేశ్వరరావు, లోకల్ శ్రీను, సారికి ఈశ్వరరావు, చీపురుపల్లి అప్పలనాయుడు, సింగంపల్లి వెంకినాయుడు, ఎం దేవుడిబాబు, చిన్నమ్మ నాయుడు, లగుడు రామునాయుడు, 100 మందికిపైగా ఆటో కార్మికులు పాల్గొన్నారు.

కేసుల్లో కన్విక్షన్ శాతం పెరగాలి

జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా

సమావేశంలో పాల్గొన్న ఎస్‌పి తుహిన్ సిన్హా, పోలీసు సిబ్బంది

ప్రజాశక్తి-అనకాపల్లి : కేసుల్లో కన్విక్షన్ శాతం పెరగాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా కోర్టు సిబ్బందికి సూచించారు. కోర్టు కానిస్టేబుళ్లు, సిఎంఎస్ సిబ్బందితో శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, సమన్లు, నాన్-బెయిలబుల్ వారెంట్లు, పిటి కేసులు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా, విశాఖపట్నంలో వివిధ కోర్టులలో ఉన్న కేసులను వేగవంతంగా ఛార్జ్‌షీట్లు దాఖలు చేయాలని, సాక్షులకు సమయానుసారం బ్రీఫింగ్ ఇవ్వాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా, నిందితులకు శిక్షలు విధింపబడేలా కోర్టు విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. సాక్షులు ఎటువంటి ఒత్తిడులకు లేదా ప్రలోభాలకు లోనుకాకుండా సమయానికి కోర్టులో హాజరు కావడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెప్టెంబర్ 13న జరగబోయే లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. దర్యాప్తులో ఎక్కడా అలసత్వం ఉండకూడదన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 39 మంది నిందితులకు శిక్షలు విధించడం కోర్టు కానిస్టేబుల్స్, సిఎంఎస్ సిబ్బంది కృషికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ మోహనరావు, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ లక్ష్మణమూర్తి, సిఎంఎస్ ఎస్ఐ రమణయ్య, కోర్టు కానిస్టేబుల్స్, సిఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో యూరియా కొరత

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలో యూరియా కొరతతో వరి రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. వర్షాలు పడక ఈ సంవత్సరం వరి నాట్లు వేయటం చాలా ఆలస్యమైంది. ఇటీవల వర్షాలు కురవడంతో వరి నాట్లు వేస్తున్నారు. వరి పంటతో పాటు చెరుకు పంట, పశుగ్రాసం ఎదుగుదలకు యూరియా అవసరం ఏర్పడింది. కాని ప్రభుత్వం సరిపడినంత యూరియా సరఫరా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూనియా కోసం షాపులు చుట్టూ తిరగాల్సి వస్తుంది. రైతు భరోసా కేంద్రాల్లో ఒక్కొక్క బస్తా ఇవ్వడంతో అది ఏ మూలకు సరిపోవటం లేదని రైతులు తెలుపుతున్నారు. ప్రభుత్వం స్పందించి వ్యవసాయానికి అనుకూలంగా రైతులకు కావలసిన యూరియా బస్తాలను సరఫరా చేయాలని రైతు సంఘం ప్రతినిధులు కోరుతున్నారు.

అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కలిగొట్ల గ్రామంలో బిఆర్.అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలను స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించిన వ్యక్తి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని పేర్కొన్నారు. అంబేద్కర్ విద్య అనే ఆయుధాన్ని సాధనగా తీసుకుని మహోన్నత వ్యక్తిగా ఎదిగారని, ఆయన్ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ముర్రు ముత్యాల నాయుడు మాట్లాడుతూ ప్రపంచంలోని 100 దేశాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో జలాశయ చైర్మన్లు పోతల పాత్రునాయుడు, పోతల చిన్నమనాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు, దొగ్గ నాయుడుబాబు, పూడి సత్యారావు, జనసేన మండల అధ్యక్షులు గొర్రెపోటు రామ్మూర్తినాయుడు, టిడిపి నాయకులు బండారు రామారావు, కార్లి సాయి సుందర్రావు, కట్టపల్లి అప్పారావు పాల్గొన్నారు.

డ్రాలో ఎంపికైన వారికి బార్లు మంజూరు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏపీ నూతన బారు విధానం 2025-28లో భాగంగా నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో రెండు, ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో ఒకటి జనరల్ కేటగిరీలోనూ, కల్లుగీత కార్మికులకు ఒక బారు నోటిపై చేసిన నేపథ్యంలో శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో డిఆర్ఓ సత్యనారాయణరావు, జిల్లా ప్రొహబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి సుధీర్ ఆధ్వర్యంలో డ్రా నిర్వహించారు. నర్సీపట్నం రెండు బార్లకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో జనరల్‌లో ఒక బారుకు నాలుగు దరఖాస్తులు రాగా డ్రా నిర్వహించి ఎంపికైన వారికి బారు మంజూరు చేసినట్టు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సుధీర్ తెలిపారు.

వైస్ ఎంపిపి భర్తకు పరామర్శ

ప్రజాశక్తి-పాయకరావుపేట : ఇటీవల కాలుకు ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పాయకరావుపేట వైస్ ఎంపిపి ధనిశెట్టి మాధవి భర్త ధనిశెట్టి తిరుమలేశ్వరావు (బుజ్జి)ని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు తదితరులు శనివారం పరామర్శించారు. వారి వెంట పార్టీ నాయకులు గెడ్డమూరి శ్రీనివాసరావు, ధనిశెట్టి బాబురావు, దగ్గుపల్లి సాయిబాబా, ఉప సర్పంచ్ జగతా శ్రీను, ధనిశెట్టి మహేష్, సర్పంచులు పన్నీరు పాపారావు ఉన్నారు.

అసైన్డ్ భూములు తిరిగి పేదలకు అప్పగించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

పెద్దల స్వాధీనంలోకి వెళ్లిన అసైన్డ్ భూములను తిరిగి పేదలకు అప్పగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేశారు. మండలంలోని వాలాబు పంచాయతీ పరిధిలో అమ్మకాలకు గురైన అసైన్డ్ భూములను శనివారం వెంకన్న పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 9/77 యాక్టు ప్రకారం అసైన్డ్ భూములను అమ్మకాలు, కొనుగోళ్ళు చేయడానికి వీల్లేదన్నారు. కాని పేదలు, గిరిజనుల ఆకలి, అవసరాలను ఆసరాగా చేసుకొని కొంత మంది ధనవంతులు 99 సంవత్సరాల లీజు పేరుతో స్వాధీనం చేసుకొని సరుగుడు, జీడి, పామాయిల్ వంటి పంటలు వేసి, అదే భూముల్లో సదరు గిరిజనులను కూలీలుగా వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే 40 శాతం భూములు అమ్మకాలు జరిగి పోయాయని తెలిపారు. కొంతమంది ఫైనాన్స్ వ్యాపారాలు, గొర్రెలు, మేకలు వంటివి గిరిజనులకు ఇచ్చి అవి తీర్చలేకపోతే భూములు రాయించుకుంటున్నారని పేర్కొన్నారు. ఇలా ఒక్క వాలాబు పంచాయతీలోనే కాదని, దేవరాపల్లి, చీడికాడ, వి.మాడుగుల, రావికమతం, రోలుగుంట, గొలుగొండ, నాతవరం, కోటవురట్ల తదితర మండలాల్లోని నాన్ షెడ్యూల్ గిరిజన ప్రాంతాలు అన్నింటిలోనూ ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఆ భూములను స్వాధీనం చేసుకొని తిరిగి పట్టాదారులకు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కోరితే తమకు ఫిర్యాదులు అందలేదని చెబుతున్నారన్నారు. అయితే 9/77 యాక్టు ప్రకారం పట్టాదారులు ఫిర్యాదు చేసినా, చేయక పోయినా అసైన్డ్ భూములు అన్యాక్రాంతమైతే రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవచ్చని, ఈ విధంగా గతంలో చింతలపూడి పంచాయతీలో గిరిజనులకు 66 ఎకరాలు, కె.కోటపాడు మండలం సంతపాలెంలో దళితులకు 18 ఎకరాలు తిరిగి అప్పగించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని గిరిజనులకు అవగాహన కల్పించాలని, ఇప్పటికే అమ్మకాలు జరిగిన భూములను సర్వే జరిపి తిరిగి పేదలకు, గిరిజనులకు భూములు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పేదలను ఐక్యం చేసి ఎర్ర జెండాలు పాతి స్వాధీనం చేసుకుంటామని, అందుకు రెవెన్యూ అధికారులే పూర్తి బాధ్యత వహించాలని వెంకన్న స్పష్టం చేశారు.

ఐద్వా జిల్లా మహాసభను జయప్రదం చేయండి

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-పరవాడ : కశింకోటలో ఆదివారం జరుగు ఐద్వా జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న టిడ్కో కాలనీలో ఆ సంఘం నాయకులు శనివారం పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు మన్యాల బంగారమ్మ, అన్నపూర్ణ మాట్లాడుతూ మద్యం, మత్తు పదార్థాల నియంత్రణ చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, కాలుష్యాన్ని నియంత్రించాలని డిమాండ్ చేశారు. మంచినీటి బోర్లు ఏర్పాటు చేయాలని, చెత్త సేకరణ కోసం ప్రభుత్వ ఏర్పాట్లు చేయాలని కోరారు. బొగ్గు లారీల వల్ల ప్రజలకు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా టిడ్కో కాలనీ కమిటీ సభ్యులు అరుణ, వరలక్ష్మి, మంగమ్మ, సరోజినీ, విమల, కనకమహాలక్ష్మి, లక్ష్మి, బంగారమ్మ, అన్నపూర్ణ, రాజకుమారి, దేవి, సాయి పాల్గొన్నారు.

కష్టపడిన కార్యకర్తలకే నామినేటెడ్ పదవులు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : కష్టపడిన కార్యకర్తలకే నామినేటెడ్ పదవులు ఇస్తామని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. టీడీపీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ క్లస్టర్, ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల పదవుల విషయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అనంతరం స్థానిక గవరపాలెం ప్రాంతానికి చెందిన కర్రి ప్రసాద్‌కు 1లక్షా 20వేల రూపాయిల సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు.

ఉత్తరాంధ్ర కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : గ్రేటర్ విశాఖ 79వ వార్డు పరిధి లంకెల పాలెంలో ఆర్‌బిఆర్ యూత్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర కబడ్డీ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. వీటిని మాడుగుల శాసన సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై దృష్టి

ప్రజాశక్తి- దేవరాపల్లి : సీజనల్ వ్యాధులు రాకుండా ఆరోగ్య శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేకాధికారి మంజుల వాణి ఆదేశించారు. మండలంలోని రైవాడ గ్రామాన్ని శనివారం ఆమె సందర్శించారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రజలకు పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచి చల్లా లక్ష్మీనాయుడు, డిప్యూటీ ఎంపీడీవో కిరణ్ వరప్రసాద్, హౌసింగ్ ఏఈ తేజ, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ వివిఎ త్రినాథ్, పంచాయతీ కార్యదర్శి అప్పారావు, ఎమ్మార్సీ పైడిరాజు, అంగన్వాడి సూపర్వైజర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపెంట పేరు మార్చాలని వినతి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలం కొత్తపెంట గ్రామం పేరు కొత్తపేటగా మార్చాలని కోరుతూ శనివారం జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామ పేరులోని పెంట అనే పదం అసభ్యార్థాన్ని కలిగిస్తోందని, గ్రామ గౌరవానికి భంగం కలగకుండా దానిని కొత్తపేటగా మార్చాలని కోరారు. అలాగే తమ గ్రామం దేవరాపల్లి మండలానికి చివర, కె.కోటపాడు మండల కేంద్రానికి కేవలం 6 కిలోమీటర్ల దూరంలోనే ఉందని, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా కె.కోటపాడులో తమ గ్రామాన్ని విలీనం చేయాలని కోరారు.

బాధ్యతతో ఉద్యోగం చేస్తే మన్ననలు

ప్రజాశక్తి-కశింకోట : బాధ్యతతో ఉద్యోగం చేస్తే అందరి మన్ననలు పొందవచ్చని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌వి.అప్పారావు ఉద్యోగ విరమణ ఆత్మీయ సభ శనివారం జరిగింది. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా భావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమం పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సూర్యఘర్ యోజనపై ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పిఎం సూర్యఘర్ యోజన పథకంపై ఎపి ట్రాన్స్‌కో అధికారులు ఇంటింటి ప్రచారం చేశారు. శనివారం ఏపీ ట్రాన్స్‌కో ఏఈ ఎం.శ్రీనివాసరావు అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీలో పర్యటించారు. రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకొని విద్యుత్ బిల్లును జీరో చేసుకోవాలని ప్రజలకు ఆయన సూచించారు. ఒక కిలో వాట్ సామర్థ్యానికి రూ.30 వేలు, రెండు కిలో వాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లకురూ. 78వేలు చొప్పున కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. ప్రాజెక్టుకు తక్కువ వడ్డీతో బ్యాంకులో రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బిసి మహిళలకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బిసి మహిళలకు సబ్ కోటానిస్తూ, మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణ చేసి మాత్రమే అమలు జరపాలని, ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు, మహిళా విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఒక్కరోజు నిరాహార దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, 30 ఏళ్లుగా కేంద్రంలో పలు ప్రభుత్వాలు మారినా, చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదింపబడలేదన్నారు. ఎట్టకేలకు 33 శాతంతో మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆమోదించడం హర్షణీయమేనన్నారు.

యూరియా కోసం ఆందోళన చెందొద్దు

ప్రజాశక్తి-కె.కోటపాడు : ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో గంగవరం పోర్టుకు 10,350 టన్నుల యూరియా వచ్చిందని, రైతులు ఆందోళన చెందొద్దని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎరువుల డీలర్లు కృత్రిమ కొరతను సృష్టిస్తూ రైతులను గందరగోళానికి గురిచేస్తున్నారని తెలిపారు. సోమవారం నుండి రైతులకు అవసరం మేరకు యూరియా సరఫరా చేయడం జరుగుతుందని చెప్పారు. డీలర్లు ఎరువులను అధిక ధరలకు అమ్మితే కేసులు నమోదు చేయడంతో పాటు లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వీఎంఆర్‌డిఎ నిధులతో కన్వెన్షన్ హాల్ ఏర్పాటుకు ఎంపీపీ రెడ్డి జగన్మోహన్‌ను ఎమ్మెల్యే బండారు అనుమతి కోరగా, అందుకు ఆయన అంగీకరించారు. అనంతరం శిథిలావస్థలో ఉన్న ఎంఈఓ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ పూర్ణిమాదేవి, తహశీల్దార్ భుజంగరావు ఎంపీడీవో సాంబశివరావు, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్, టిడిపి నాయకులు జూరెడ్డి రాము, దాడి ఎరుకునాయుడు, పూడి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అదనపు టారిఫ్ భారం ప్రభుత్వమే భరించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అమెరికా విధించిన అదనపు టారిఫ్ భారం ప్రభుత్వమే భరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అమెరికాతో ఏర్పడిన వివాదం కారణంగా మన దేశం నుంచి వెళ్తున్న ఉత్పత్తులపై 50శాతం అదనపు టాక్స్ వలన దేశీయ పరిశ్రమలు మనుగడ, కార్మికుల ఉపాధికి సమస్య ఏర్పడుతుందని పేర్కొన్నారు. పరిశ్రమలకు కార్మికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అమెరికాపై ఒత్తిడి చేసి అదనపు టారిఫ్ పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకొనేలా మోడీ ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. టారిఫ్ పెంపు బ్రాండిక్స్ వస్త్ర పరిశ్రమపై పడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

దళితుల ఐక్యత దెబ్బతీసేందుకు మోడీ, బిజెపి కుట్ర

ప్రజాశక్తి-అనకాపల్లి : దేశంలో దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు ప్రధాని మోడీ, బిజెపి కుట్ర చేస్తున్నాయని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ రత్నాకర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అనకాపల్లి ప్రెస్క్లబ్‌లో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్త ఎస్సీ వర్గీకరణ కుట్రలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి భాగస్వాములు అయ్యారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గంపై కత్తిగట్టాయని ఆరోపించారు. దళితులను హోల్‌సేల్‌గా వాడుకున్న జగన్మోహన్‌రెడ్డి దీనిపై కనీసం నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. కులాన్ని మతాన్ని రెచ్చగొట్టి విభజించి, దేశాన్ని అమ్ముకునే పనిలో మోడీ పడ్డాడని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో కొత్తపల్లి శ్రీనివాస్, అడ్వకేట్ అంగుళూరు ఈశ్వర్, రేపాక మధుబాబు, బొలిమి వినోద్ కుమార్, షేక్ జిలాని, టి.సుబ్బారావు, నెల్లి సూరిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్ల పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం గ్రామ సర్పంచ్ ఎస్.భాగ్యలక్ష్మి బాపు నాయుడు చేతులు మీదుగా స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నియోజకవర్గం ప్రత్యేకాధికారి శచీదేవి

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎంఎల్‌సిసి

ప్రజాశక్తి-కోటవురట్ల : సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండల లెవెల్ కో-ఆర్డినేషన్ కమిటీ (ఎంఎల్‌సిసి) సమావేశం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ప్రత్యేక అధికారి శచీదేవి అన్నారు. తహశీల్దారు తిరుమల బాబు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని నాలుగు గ్రామాల సమస్యలపై సమీక్షించారు. జల్లూరు, పీకే పల్లి, జగ్గంపేట గ్రామంలో రెండు సమస్యలు పట్ల సమావేశంలో చర్చించారు. జల్లూరు, పీకే పల్లి సమస్యలను 20వ తేదీకి వాయిదా వేయగా, జగ్గంపేట రెండు సమస్యలు కోర్టు పరిధిలో ఉన్నందున కోర్టును ఆశ్రయించాలని ఫిర్యాదుదారులకు సూచించారు. ఏఎస్ఐ గంగరాజు, డిటి రమేష్, జూనియర్ అసిస్టెంట్ సత్తిబాబు, పాల్గొన్నారు.

ఆర్చరీ క్రీడాకారుడు గణేష్‌కు సన్మానం

ప్రజాశక్తి-పరవాడ : కెనడాలో ఈ నెల 17 నుంచి 24 వరకు జరిగిన వరల్డ్ ఆర్చరీ యువ ఛాంపియన్‌షిప్‌లో టీం గోల్డ్ మెడల్ సాధించిన సంస్కృతి గ్లోబల్ స్కూల్ పూర్వ విద్యార్థి టి.గణేష్ మణిరత్నంను శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సీఈఓ కె.నిశాంత్, కోఆర్డినేటర్ పి.రామలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారులంతా వీసీకి హాజరు కావాలి

ప్రజాశక్తి-కోటవురట్ల : ప్రతి సోమవారం జిల్లా నుండి ఉన్నతాధికారులు నిర్వహిస్తున్న వీసీ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులంతా పాల్గొవాలని డిఆర్‌డిఏ పీడీ సచీదేవి ఆదేశించారు. మండల పరిషత్తు సమావేశ మందిరంలో శనివారం మండల స్థాయి అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీసీలో పాల్గొంటే ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు అమలు తీరు ఉన్నతాధికారులు ఇస్తున్న సూచనలు, అంశాల పట్ల అవగాహన కలుగుతుందని చెప్పారు. వ్యవసాయం, ఇంజనీరింగ్, గృహ నిర్మాణ పనులపై ఆమె ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డ్రోన్‌తో ప్రమాదకర ప్రదేశాల పరిశీలన

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండలంలో అడ్డరోడ్డు ప్రాంగణంలో రోడ్ సేఫ్టీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాసరావు హైవేపై డ్రోన్ కెమెరా సహాయంతో ప్రమాదకరమైన ప్రదేశాలను పరిశీలించారు. ప్రమాదాలు నివారించడానికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ ఎల్ రామకృష్ణ, ఎస్ఐ విభూషణరావు, నర్సీపట్నం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మూర్తి, హైవే సేఫ్టీ అథారిటీ నవీన్ పాల్గొన్నారు.

నానో యూరియా పిచికారీ పరిశీలన

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలో దార్లపూడి గ్రామంలో నానో యూరియా పిచికారీ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి బి మోహన్ రావు శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సౌజన్య, నక్కపల్లి మండల వ్యవసాయ అధికారి, దార్లపూడి సర్పంచ్, ఉప సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం లీగల్ సెల్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిరోధంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ భాగ్యలక్ష్మి, ప్రొఫెసర్ రఫాత ఖాన్‌లు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వినియోగం ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయని, యువత మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి శంకర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ గణేష్ లెక్కల పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మానం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ విభాగంలో ఏఆర్ఎస్ఐగా ఎం.వీర్రాజు, అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా ఆర్.పైడితల్లి విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా శనివారం ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమయానికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏవో సిహెచ్.తిలక్‌బాబు, సిఐలు లక్ష్మణమూర్తి, బెండి వెంకటరావు, మన్మధరావు, ఎస్సై రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ అప్పలరాజు, పోలీసు అధికారులు, సన్మాన గ్రహీతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న ఎమ్మెల్సీ

హెచ్ఎం రమణ ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక ముస్లిం బడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వి. రమణ ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు ముఖ్య అతిథిగా హాజరై, రమణను శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు డీజీ నాథ్, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ఏ. వరహాల నాయుడు, జీవి రమేష్, జిల్లా అసోసియేటివ్ ప్రెసిడెంట్ కె.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం అందుకుంటున్న ఆచార్యులు

ఆచార్యులకు పురస్కారం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు శిక్షా రత్న పురస్కారం అందుకున్నారు. విశాఖపట్నం అంబేద్కర్ భవన్‌లో శనివారం మానవహక్కులు, నేరనిరోధక విభాగం ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. మానవ హక్కుల, నేర నిరోధక సంఘం నేషనల్ ఛైర్మన్ బోడ రాకేష్ చేతుల మీదుగా ఆచార్యులకు శిక్షా రత్న అవార్డును అందించి, సత్కరించారు. సమాజంలో వివిధ రంగాలలో సేవా కార్యక్రమాలను చేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి అవార్డులను అందజేస్తున్నట్లు మానవ హక్కుల సంఘం, నేరనిరోధక విభాగం నేషనల్ ఛైర్మన్ బోడ రాకేష్ తెలిపారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి

బైలపూడిలో కార్డెన్‌సెర్చ్

ప్రజాశక్తి-చీడికాడ:చీడికాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైలపూడి గ్రామంలో కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్ శనివారం ఉదయం 4గంటల నుండి 8 గంటల వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి శ్రావణి మాట్లాడుతూ, ఈ ఆపరేషన్‌లో భాగంగా ఎటువంటి రికార్డులు లేని 13 మోటార్ సైకిళ్ళు, 1 ఆటో, 2 కార్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. బైలపూడి గ్రామంలో గంజాయి కేసుల్లో నిందితులకు ప్రతి వారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. .ఇప్పటివరకు ఈ గ్రామానికి చెందిన 11 మంది వ్యక్తులకు గత ఏడాది కాలంలో గంజాయి కేసుల్లో 10సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ లక్ష జరిమానా విధించడం జరిగిందన్నారు.ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి రవాణా లేదా విక్రయానికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నాయుడు, ఎస్సై సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మల పరిశ్రమ ఏర్పాటుకు కృషి

హోంమంత్రి అనిత

మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

ప్రజాశక్తి- నక్కపల్లి:బొమ్మల పరిశ్రమ వస్తే 25 వేల మంది మహిళలకు ఉపాధి వస్తుందని, పరిశ్రమ ఏర్పాటు కోసం అన్ని విధాలా ప్రయత్నం చేస్తున్నానని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలో వేంపాడు టోల్ ప్లాజా సమీపంలో భారతీ కన్వెన్షన్ లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన స్త్రీ శక్తి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిన మహానుభావుడు ఎన్ టి ఆర్ అని, మహిళలు రాజకీయాల్లో రాణిస్తున్నారంటే దానికి మూల కారణం ఆయనే అన్నారు. మహిళలు సంతోషంగా ఉంటే వ్యవస్థ బాగుంటుందని, మహిళలు సంపాదిస్తే, కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. ఉచిత బస్సు మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తున్నారన్నారు.మహిళలు వ్యాపార రంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో సబ్సిడీ పై రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇచ్చామన్నారు. వేంపాడు టోల్ ప్లాజా నుండి అడ్డురోడ్డు వరకు ఆర్టీసీ బస్సులో హోం మంత్రి అనిత ప్రయాణించి మహిళల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ డిఎ పి డి సచీదేవి, జిల్లా మత్స్యశాఖ అధికారి విజయ పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

ప్రజాశక్తి- నక్కపల్లి:వరిలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు రైతులకు సూచించారు. డిఇఓ, మండల వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్‌తో కలిసి మండలంలో శనివారం ఉపమాక పంచాయితీ మనబాలవానిపాలెం, కాగిత, ఉద్దండపురం, గొడిచెర్ల గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వరి ఉడుపులను పరిశీలించారు. ఎరువుల వినియోగం, కలుపు నివారణ చర్యలు, వ్యవసాయ యాంత్రికరణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కలుపు మందు పిచికారి చేసేటప్పుడు నేలలో తగినంత తేమ ఉండాలని, కలుపు మందులు వీలైనంత వరకు ఉదయం పూట మాత్రమే పిచికారి చేయాలన్నారు., మందు పిచికారి చేసేటప్పుడు నేలలో తగినంత తేమ ఉంటే మంచిదన్నారు. మండలం లో వరి

అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

సాధారణ సాగు 4350 ఎకరాలు కాగా,ఇప్పటి వరకు 3125 ఎకరాల్లో వరి ఉడుపులు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సాయి కుమారి, ఆర్ఎస్‌కె సిబ్బంది ధనరాజ్, రైతులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న శివ నారాయణ రాజు

న్యాయ అంశాలపై సదస్సు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:న్యాయ సేవా సంస్థ చైర్మన్ సియాజ్ ఖాన్ ఆదేశాలు మేరకు స్థానిక నర్సీపట్నం మహిళా జూనియర్ కాలేజీలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, బాల్యవివాహాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలతో చిన్నతనంలో గర్భం దాల్చడంతో అనేక సమస్యలు ఎదురవుతాయని, వాటితో కలిగే నష్టాలను న్యాయ సేవా సభ్యులు కె.శివనారాయణరాజు విద్యార్థులకు తెలియజేశారు. అట్రాసిటీ కేసులు ఎదుర్కొంటున్న బాధితులకు ప్రభుత్వం చట్టపరమైన రక్షణ కల్పిస్తోందని, ప్రతి ఒక్కరు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాల్య వివాహాలపై సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ శోభా, ఉపాధ్యాయురాలు శివ పార్వతి పాల్గొన్నారు.

భూ సమస్యలపై వినతులు

ప్రజాశక్తి-గొలుగొండ: భూ సమస్యల పరిష్కారం కోసమే భూ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గొలుగొండ తహశీల్దార్ పి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం గొలుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో భూసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ బాబూరావు, ఎస్సై రామారావు పాల్గొన్నారు. మండలంలోని నలుగురు రైతులు భూసమస్యలపై వినతులు అందజేశారు.. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మాట్లాడుతున్న అధికారులు

సాఫీగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మాట్లాడుతున్న పద్మావతి

ప్రజాశక్తి-నర్సీపట్నం:మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశం సాఫీగా సాగింది, పట్టణంలో అభివృద్ధి కుంటుపడుతుందని వైసిపి కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నకు సమాధానంగా టిడిపి కౌన్సిలర్ పద్మావతి మాట్లాడుతూ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ విషయంపై వైసిపి కౌన్సిలర్లు చర్చకు సిద్ధమా అన్నారువైసిపి హయంలో చేపట్టిన పనులకు నిధులు మంజూరు కాకుండా చేపట్టడంతో గుత్తేదారులు ఇబ్బంది పడుతున్నారని, త్వరలో ప్రధాన రహదారి పనులు చేపట్టేందుకు చర్యలు చేపడతామన్నారు, కాలువలు నిర్మాణాలు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు, అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక నిందలు వేయడం తగదని వైసిపి కౌన్సిలర్లను ఉద్దేశించి అన్నారు ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహకాన్ని ఇస్తున్న మంత్రి అనిత

గణేష్‌కు నగదు ప్రోత్సాహకం అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి:అమెరికాలో అక్టోబర్ 12 నుంచి జరగనున్న పారా వాలీబాల్ వరల్డ్ కప్ కు ఎంపికైన క్రీడాకారుడు అన్నం గణేష్‌ను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అభినందించారు. ఎస్.రాయవరం మండలం సోముదేవుపల్లికి గ్రామానికి చెందిన గణేష్ చిన్న నాటి నుంచే పారా స్పోర్ట్స్‌పై ఆసక్తి కనబరుస్తూ తన ప్రతిభను ప్రదర్శిస్తూ జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ మేరకు నక్కపల్లిలో మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద శనివారం హోం మంత్రి అనిత వాలీబాల్ క్రీడాకారుడు గణేష్‌ను అభినందించి, నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ప్రభుత్వ సాయం కూడా అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తనిఖీలు చేపడుతున్న అధికారులు

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-చీడికాడ:ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల డిస్పెన్సరి అధికారి కెఎల్వీఎన్ మూర్తి అన్నారు. చీడికాడ మండల కేంద్రంలో శనివారం రోహిత ట్రేడర్స్, సిరిజం గ్రామంలో రైతు సేవ కేంద్రాలను ఎంపీడీవో, తహశీల్దార్, మండల వ్యవసాయ అధికారితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, రైతులకు అవసరమైన ఎరువులను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే అమ్మాలని, లేకుంటే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.ఎరువులు రైతు సేవ కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. మండలంలో ఇప్పటివరకు 188 టన్నుల యూరియా సరఫరా చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కిషన్ లింకన్, మండల అభివృద్ధి అధికారి హేమ సుందర్‌రావు, ఏఒ కృష్ణవేణి సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్‌లతో గంజాయి గుర్తింపు

ప్రజాశక్తి- రావికమతం:గంజాయి రవాణా మార్గాలను కనుగొనేందుకు డ్రోన్‌లను ఉపయోగించడం జరుగుతుందని రావికమతం ఎస్సై రఘువర్మ తెలిపారు. రావికమతం మండల పోలీస్ స్టేషన్ పరిధిలో కవగుంట, ఎర్రబంద, బుడ్డి బంద, కొట్నాబెల్లి గ్రామాలలో శనివారం డ్రోన్ సహాయంతో కనుగొనడం జరుగు తుందన్నారు. అక్రమ గంజాయి రవాణా అరికట్టటకు ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి సులువుగా కనుగొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు.

డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ

ఆట స్థలాల పరిశీలన

ప్రజాశక్తి-రావికమతం:మండల కేంద్రంలో వాలీబాల్ కోర్టు స్థలాన్ని శనివారం తహసిల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో సీతారామస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దారు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని గ్రామాలలోనూ యువతను క్రీడలపై ప్రోత్సహించేందుకుగాను వాలీబాల్, కబడ్డీ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. ఆ దిశగా ప్రతి గ్రామంలో ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాలీబాల్, కబడ్డీ ఆటలు ఆడుకునేందుకు వీలుగా ఉండే స్థలాలను పరిశీలన చేయడం జరుగుతుందన్నారు. మండల కేంద్రంలో వాలీబాల్, కబడ్డీ కోర్టు నిర్వహణకు సుమారు 20 లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామస్వామి పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ ఉషారాణి

హాకీ క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి -నక్కపల్లి:రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థినిలను గురుకులం ప్రిన్సిపల్ యు ఉషారాణి అభినందించారు.నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్ శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ తిరుపతిలో జరిగింది. అమరావతి చాంపియన్షిప్ హాకీ విన్నర్స్‌గా నక్కపల్లి హాకీ టీం గెలుపొందింది. ఈ టీంలో నక్కపల్లి గురుకులంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినిలు పి.ప్రసన్న కుమారి, జే.కుసుమ విందు్య వాషిణి పాల్గొని సత్తా చాటారు. ఈ మేరకు శుక్రవారం విశాఖపట్నంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా హాకీ క్రీడాకారులకు జ్ఞాపకలను అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక గురుకులంలో శనివారం ప్రిన్సిపల్ యు.ఉషారాణి ఆధ్వర్యంలో హాకీ క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేసి, అభినందనలు తెలియజేశారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న దేవానంద రెడ్డి

విద్యతోనే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని కేజీబీవీ కార్యదర్శి దేవానంద రెడ్డి శనివారం సందర్శించారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకుని మంచి మార్కులు సాధించాలన్నారు. విద్యతోనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. తరగతి గదిలో సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా ప్రతి నిమిషం చదువుపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. మధ్యాహ్నం భోజనం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి షేక్ సలీమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న రత్నాకర్

స్పెషల్ ఒలింపిక్ విజేతలు, కోచ్‌కు సత్కారం

ప్రజాశక్తి -రావికమతం: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్పెషల్ ఒలింపిక్ భారత్ క్రీడల్లో గెలుపొందిన రావికమతం మండలం దివ్యాంగ విద్యార్థులకు, కోచ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నేషనల్ బాడీ బిల్డర్ శిలపరశెట్టి బాబ్జి ఆధ్వర్యంలో శనివారం అనకాపల్లి పట్టణంలో వివి రమణ రైతు భారతిలో నిర్వహించిన "నారా లోకేష్ క్రీడా యువకిరణాలు 2025"లో భాగంగా జాతీయ స్థాయి స్పెషల్ ఒలంపిక్ భారత్ క్రీడల్లో గెలుపొందిన రావికమతం మండలం దివ్యాంగ విద్యార్థులు అప్పికొండ గణేష్ , నక్కరాజు బాల సరస్వతిని, కోచ్, ప్రత్యేక ఉపాధ్యాయుడు బొడ్డు మహాలక్ష్మి నాయుడిని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, సకల సూర్యనారాయణ (అంతర్జాతీయ పవర్ లిఫ్టర్) దాడి జైవీర్ (అధ్యక్షులు ఖో ఖో అసోసియేషన్), వెలగ నారాయణరావు, కొణతాల అప్పలనాయుడు (సీనియర్ పవర్ లిఫ్టర్) చేతుల మీదుగా మెమొంటో, సర్టిఫికెట్‌తో ఘనంగా సత్కరించి అభినందించారు.

కల్లు గీత కార్మికుల ర్యాలీ

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:సమస్యలను పరిష్కరించాలని కల్లుగీత కార్మికులు నర్సీపట్నం అబీద్ సెంటర్ నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ, ఎక్సైజ్ స్టేషన్ సిఐకి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రా దేముడు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ తలరాతలు మారతాయని ఆశించి ఓట్లేసి గెలిపించామని, కానీ ఆ ఆశలు అడియాశలుగా మిగిలిపోయాయని తెలిపారు.కేరళ రాష్ట్రం గీతకార్మికులను ఆదుకుంటూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. మన రాష్ట్రంలో కూడా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వృత్తిని ఆధునికరించి ఆదుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం పైన గీత కార్మికులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ఆదరణ పథకం ప్రవేశపెట్టి అవినీతికి తావు లేకుండా అమలు చేయాలని, తాటిచెట్టు ద్వారా 200 రకాల ఉత్పత్తులు తయారు చేయవచ్చని, తాటిబెల్లం, సిరప్, పానీయాల లాంటి బై ప్రొడక్ట్స్ తయారు చేయవచ్చని వీటిని కూటమి ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. తాటి ఉత్పత్తుల పరిశ్రమలను నెలకొల్పి యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. తాటికల్లులో మంచి ఔషధములు, ఆరోగ్యవంతమైన పోషకాలు ఉన్నాయని తెలిపారు. బెల్టుషాపులు తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు.వృత్తిలో ప్రమాదాలు తగ్గించేందుకు సేఫ్టీ పరికరాలు ఇవ్వాలన్నారు. బెల్టు షాపులు పెట్టిన గ్రామ పంచాయితీల్లో సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయాలన్నారు. గీతకార్మికుల పిల్లలకు ఇతర వృత్తులు చేసుకోవడానికి 50 శాతం సబ్సిడీతో 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బి.నాగేశ్వరరావు, ఎన్.రాజబాబు, లావరాజు, రమణ, చిన్నసత్యం తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ చేపడుతున్న కల్లు గీత కార్మికులు

ఆసుపత్రుల అభివృద్ధికి నిధులు

- స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి -నర్సీపట్నం:రూ. 47 లక్షలతో ఏరియా హాస్పిటల్, 72 లక్షలతో గ్రామీణ ప్రాంత ఆరోగ్య కేంద్రాలు అభివృద్ధి పనులు చేపడతామని స్పీకర్ అయ్యన్న వెల్లడించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రిలో శానిటరీ పనులతో పాటు ఆపరేషన్ థియేటర్, ఆక్సిజన్ పైపులైన్ పనులు చేపడతామన్నారు. నియోజవర్గంలో వైద్య సదుపాయం బలోపేతం చేసేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 72 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. వేములపూడికి రూ.5.50 లక్షలు, జిల్లేడు పూడికి రూ.2.50 లక్షలు చీడిగుమ్మల రూ. 8 లక్షలు, నాతవరం రూ.5.50 లక్షలు, గొలుగొండ 5 లక్షలు, కేడీపేట 5 లక్షలు, నర్సీపట్నం బొంతు వీధి 3 లక్షలు, పెద్ద బొడ్డేపల్లి 11 లక్షలు, బలిఘట్టం 27 లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా పని చేస్తుందన్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో..

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ

వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సందర్భంగా స్కూల్ పిల్లలకు వివిధ అంశాలపై సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ కేటగిరీలలో పోటీలు నిర్వహించారు. 24 స్కూళ్ల నుంచి 371 మంది పిల్లలు పాల్గొన్నారు. ప్రతి అంశంలో ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి జ్ఞాపికలు ప్రదానం చేశారు. పోటీలలో పాల్గొన్న వాళ్ళందరికీ సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు గిడుగు చిత్రపటానికి ముఖ్య అతిథులు, జడ్జీలుగా వ్యవహరించిన వారంతా కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్ర యూనివర్సిటీ తెలుగు దూరవిద్యా విభాగం ఆచార్యులు వెలమల సిమ్మన్న మాట్లాడుతూ గిడుగు రామమూర్తి గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న దయానందన్‌ను సిమ్మన్న చేతుల మీదుగా సన్మానించారు. సిమ్మన్నను, జడ్జీలుగా వ్యవహరించిన 14 మందిని విజ్ఞాన కేంద్రం బాధ్యులు జిఎస్.రాజేశ్వరరావు సత్కరించారు. కార్యక్రమంలో సిహెచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

భాషా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న వెలమల సిమ్మన్న తదితరులు

పంచాయతీ కార్మికులకు హెల్త్ అలవెన్స్ రూ.4 వేలు ఇవ్వాలి

యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు శంకరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : గ్రామపంచాయతీ కార్మికులకు హెల్త్ అలవెన్స్ రూ.4000 ఇస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ జారీ చేసిన జీవోను తక్షణమే అమలు చేయాలని ఎపి గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు ఆర్ శంకర్‌రావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం యూనియన్ అనకాపల్లి జిల్లా కమిటీ సమావేశంలో శంకరరావు మాట్లాడుతూ యూనియన్ పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లకు, గార్డులకు నెలకు రూ.4000 హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని జీవో నెంబర్ 216097 పంచాయతీరాజ్ కమిషనర్ జారీ చేశారని తెలిపారు. దానిని అన్ని పంచాయతీల్లో తక్షణమే అమలు చేయాలని కోరారు. గ్రామపంచాయతీ కార్మికులు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, చాలీచాలని జీతాల వలన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్నా, వేతనాల్లో వ్యత్యాసం ఉందని, కనీస వేతనం అమలు చేయాలని, ప్రతి నెలా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 2000 మంది గ్రామపంచాయతీ కార్మికులు ఉన్నారని, మేజర్ పంచాయతీల్లో 12 వేల వరకు వేతనం ఇస్తున్నా, చిన్న పంచాయతీల్లో రూ.3వేలు నుంచి రూ.6వేలు మాత్రమే జీతాలు చెల్లిస్తున్నట్లు చెప్పారు. పంచాయతీల్లో నిధులు లేవనే పేరుతో అకారణంగా తొలగిస్తున్నారని, కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు ములకలాపల్లి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి ఎ.నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి దాకారపు శ్రీనివాసరావు, వై అర్జున, జి పోతురాజు, ఎం రమణ, బండారు, అప్పారావు, జి.కొండబాబు, డి.పరదేశి, చంద్రరావు, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో జిఒ ప్రతిని చూపుతున్న శంకరరావు

కెమిస్ట్రీ లెక్చరర్‌పై మరో కేసు

14 రోజుల రిమాండ్

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ గుత్తల శ్రీధర్ (56)పై మరో లైంగిక వేధింపుల కేసు నమోదైంది. ఈ కేసులో ఆయన్ని అరెస్టు చేసి 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. ఈ మేరకు పోలీసులు గురువారం ఆయన్ని అనకాపల్లి సబ్ జైలుకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 23న మధ్యాహ్నం సమయంలో కళాశాల కెమిస్ట్రీ ల్యాబ్‌లో ఓ విద్యార్థినిపై లెక్చరర్ శ్రీధర్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తేలింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు, తోటి విద్యార్థినుల వాంగ్మూలాలు, ఇతర సాక్ష్యాధారాల ఆధారంగా పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఇప్పటికే ఓ మైనర్ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన కేసు శ్రీధర్‌పై నమోదై దర్యాప్తులో ఉంది. రెండో కేసు నమోదు అనంతరం, దర్యాప్తు అధికారి అయిన ఉమెన్ ఎస్ఐ జిబిఎస్.మహాలక్ష్మి గురువారం శ్రీధర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అనకాపల్లి 11వ అదనపు జిల్లా మెజిస్ట్రేట్ కోర్టు ఆయనకు సెప్టెంబర్ 12వ తేదీ వరకు రిమాండ్ విధించింది. ఈ నేపథ్యంలో ఆయన్ని అనకాపల్లి సబ్ జైలుకు తరలించారు.